సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 26 । అక్టోబర్ । 2024



రూ. కోటితో ఈత కొలను..

ఇల్లెందు పట్టణంలోని లేక్ వ్యూ పార్క్‌లో రూ. కోటి వ్యయంతో ఈత కొలను నిర్మాణం చేపట్టారు.

10లో



ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

ఏపీలో కలిపిన ఐదు గ్రామ పంచాయతీల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు.

10లో

గరిష్టం / కనిష్టం

32° / 22°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం నుంచి సాయత్రం వరకు వాతావరణం చల్లగా ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం , ప్రత్యేక పూజలు గావించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



దాతలను సన్మానిస్తున్న అర్చకుడు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, అర్చకులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయానికి విరాళం

మండలంలోని శ్రీ పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణం, దసరా నవరాత్రోత్సవాల నిర్వహణకు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మైలారానికి చెందిన జి.వేణుమాధవ్ – విజయశాంతి దంపతులు శుక్రవారం రూ.10,116 విరాళం అందజేశారు. వీరిని ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, అర్చకులు సన్మానించారు.

5న ఖమ్మం కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ


కొత్తగూడెంరూరల్: రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై నవంబర్ 5న ఖమ్మం కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఇ.ఇందిర తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రిజర్వేషన్లపై ఆసక్తి కలిగిన పార్టీల నుంచి అభ్యర్థనలు, సలహాలు ఆక్షేపణలను ఆహ్వానించాలని ఈ 17న బీసీ కమిషన్ తీర్మానించిందని పేర్కొన్నారు. ఖమ్మం ఐడీఓసీలో జరిగే బహిరంగ విచారణకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, బీసీ సంచార జాతుల కుల పెద్దలు తమ విన్నపాలకు సంబంధించి తెలుగు/ఆంగ్లభాషలో ఆరు సెట్లతో హాజరు కావాలని కోరారు.

రేపు ఫిట్టర్ రాతపరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 123 ఫిట్టర్ గ్రేడ్ పోస్టులకు ఈ నెల 27న ఇంటర్నల్ అభ్యర్థులతో రాతపరీక్ష నిర్వహించనున్నారు. సింగరేణి మహిళా కళాశాలలో పరీక్ష జరగనుండగా, సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల నుంచి 60 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.

28న 'నిధి ఆప్ కే నికట్'

ఖమ్మంసహకారనగర్: ఉద్యోగులు, పెన్షనర్లు, సంస్థల యాజమాన్యాలకు అవగాహన కల్పించడమే కాక సమస్యలు తెలుసుకునేందుకు ఈనెల 28న 'నిధి ఆప్‌కే నికట్' నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఖమ్మంలో రైల్వే స్టేషన్ రోడ్డులోని జీవీ మాల్, భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మున్సిపాలిటీ కార్యాలయంలో ఈ కార్యక్రమం 28న ఉదయం 9–15నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉంటుందని వెల్లడించారు. ఉద్యోగులు, యాజమాన్యాలకు ఆన్‌లైన్ సేవల విధివిధానాలపై అవగాహన కల్పించడమే కాక పెన్షనర్లకు జీవన ప్రమాణ్ సేవలు అందిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పక్కన ఖమ్మం, మానుకోట ఎంపీలు రఘురాంరెడ్డి, బలరాం నాయక్, కలెక్టర్ జితేష్ వి.పాటిల్

మెరుగైన జీవితం అందించాలి

అభివృద్ధి ఫలాలు మారుమూల గిరిజనులకూ చేరాలి

- జిల్లాలో చేపట్టిన రక్తహీనత నివారణ చర్యలు భేష్
- విద్య, వైద్యం, ఆరోగ్య రంగాల్లోనూ మెరుగు
- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సూపర్‌బజార్(కొత్తగూడెం): అభివృద్ధి ఫలాలు మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేద గిరిజనులకు అందించి మెరుగైన జీవితం గడిపేలా కృషి చేయాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పిలుపు నిచ్చారు. కొండరెడ్ల విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. శుక్రవారం జిల్లాలో పర్యటించిన ఆయన కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, కళాకారులు, రచయితలు, వివిధ రంగాల ప్రముఖులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత గవర్నర్‌కు ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాంనాయక్, కొత్తగూడెం, భద్రాచలం ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, తెల్లం వెంకట్రావు, కలెక్టర జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్, ఎస్పీ రోహిత్ రాజు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన గవర్నర్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఆ తర్వాత కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ముఖాముఖి సమావేశంలో కలెక్టర్ జిల్లా ప్రాముఖ్యతను, సంస్కృతి, సంప్రదాయాలు, వివిధ ప్రభుత్వ శాఖలు అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుతీరు బాగుందని అభినందించారు. ప్రధానంగా జిల్లాలో 2021 సంవత్సరంలో 73 శాతం ఉన్న రక్తహీనతను 2024 నాటికి 21 శాతానికి తీసుకురావడం హర్షణీయమన్నారు. ఇందుకోసం చేపట్టిన చర్యలను పూర్తి వివరాలతో అందజేస్తే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా జిల్లాలోని 481 గ్రామపంచాయతీలను బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించడం సంతోషకరమని వ్యాఖ్యానించారు.

మహిళా సాధికారతతోనే భవిష్యత్ అభివృద్ధి

జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల కార్యక్రమాలు, ఆదివాసీ గిరిజన మహిళలు తయారుచేసిన వంటకాలు చాలా బాగున్నాయని, భవిష్యత్ అభివృద్ధి మహిళా సాధికారతపై ఆధారపడి ఉందని పేర్కొన్నారు. జిల్లాలో విద్య, వైద్యం, ఆరోగ్య రంగాలు మెరుగైన స్థానంలో ఉన్నాయని అన్నారు. విద్యార్థులకు తరగతి గదుల్లో చిన్న చిన్న చేతివృత్తులకు సంబంధించిన వస్తువుల తయారీని నేర్పించాలన్నారు. 2047 నాటికి దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి వికసిత్ భారత్ కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. సమాజం అంటే సంపద కాదని సంస్కృతి అని పేర్కొన్నారు. జిల్లాలో నదులు, అటవీ సంపద, బీపీఎల్, కేటీపీఎస్, హెవీవాటర్‌ప్లాంట్, సింగరేణి గనులు ఉన్నాయని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే జీవనోపాధి పెంపొందించుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. భద్రాచలం, పర్ణశాలలోని శ్రీసీతారామ చంద్ర స్వామి దేవాలయాల పరంగా పర్యాటక శాఖను అభివృద్ధి చేసుకుని ఉపాధి అవకాశాలు కల్పించుకోవచ్చని అన్నారు. అనంతరం వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు సాధించిన రచయితలు, కళాకారులు, సాహితీవేత్తలు, డాక్టర్లు, అడ్వకేట్లను గవర్నర్ సన్మానించారు. ఆ తర్వాత జిల్లా యంత్రాంగం గవర్నర్‌ను సన్మానించారు. కళాకారుడు భూక్య రాజేష్ గవర్నర్ చిత్రాన్ని గీసి అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ సెక్రటరీ వెంకటేష్ శ్యామ్, జిల్లా అటవీశాఖాధికారి కృష్ణగౌడ్, అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు మధు, దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో స్టాల్‌ను పరిశీలిస్తున్న గవర్నర్



గవర్నర్‌కు చిత్రపటం అందిస్తున్న కళాకారుడు రాజేష్

రామయ్య సన్నిధిలో గవర్నర్

- తలసేమియా వార్డును ప్రారంభించిన జిష్ణుదేవ్ వర్మ
- పటిష్ట బందోబస్తు నడుమ పర్యటన

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారిని శుక్రవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ దర్శించుకున్నారు. ఐటీసీ పీఎస్‌పీడీ గెస్ట్‌హౌస్‌లో బస చేసిన ఆయన శుక్రవారం ఉదయం ఆలయానికి చేరుకున్నారు. ఆలయ పండితులు పరివట్టం కట్టి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ విశిష్టతను వివరించి వేదాశీర్వచనం చేశారు. ఈఓ రమాదేవి స్వామి వారి జ్ఞాపికను, ప్రసాదాలను అందచేశారు.

తలసేమియా, సికిల్‌సెల్ వార్డు ప్రారంభం

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో భద్రాచలంలో ఏర్పాటు చేసిన తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా ప్రత్యేక వార్డును గవర్నర్ ప్రారంభించి మాట్లాడారు. ఏజెన్సీలో గిరిజనులకు రెడ్‌క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలను అభినందించారు. తలసేమియా, సికిల్ సెల్ బాధితులకు సంస్థ ద్వారా మరిన్ని సేవలను అందజేయటానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం చికిత్స పొందుతున్న చిన్నారులకు వస్త్రాలను అందచేశారు. కేంద్రం నిధుల నుంచి ఏరియా ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చేందుకు అందించిన ప్రతిపాదనలను పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ సెక్రటరీ టూ గవర్నర్ వెంకటేష్, జాయింట్ సెక్రటరీ టూ గవర్నర్ భవాని శంకర్, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్, ఎస్పీ రోహిత్ రాజు, రెడ్‌క్రాస్ జిల్లా బాధ్యులు డాక్టర్ కాంతారావు పాల్గొన్నారు.

ప్రముఖుల స్వాగతం

భద్రాచలం వచ్చిన గవర్నర్‌కు మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, అటవీ శాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా విలీన ఐదు గ్రామ పంచాయతీలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలను అందచేశారు. గవర్నర్ పర్యటన సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పర్యటన ఆద్యంతం రోడ్డుకు ఇరు వైపులా ఉన్న ట్రాఫిక్‌ను నియంత్రించారు. దేవస్థానంతోపాటు రెడ్‌క్రాస్ సంస్థ కార్యక్రమాల్లో సైతం కొద్ది మందినే అనుమతించారు.



ఆలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

'కుడా'తో శరవేగంగా అభివృద్ధి..

- కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతో ఏర్పాటు
- జీఓ 177 జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు, పరిసర గ్రామాలను కలుపుతూ హెచ్ఎండీఏ తరహాలో కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా)ను ఏర్పాటు చేస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 177 జారీ చేసింది. జంట పట్టణాలు సమగ్ర అభివృద్ధి సాధించాలంటే కుడా ఆవశ్యమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పలుమార్లు విన్నవించగా, ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు పారిశ్రామిక ప్రాంతాలుగా రోజురోజుకూ విస్తరిస్తున్నాయని పేర్కొన్నారు. షెడ్యూల్ భూములు, సింగరేణి, ఇతర పరిశ్రమల భూములు ఎక్కువగా ఉండటంతో కుడా ఏర్పాటుతో ఈ ప్రాంతంలో మరింత పారిశ్రామిక వృద్ధి సాధ్యమవుతుందన్నారు. జంట పట్టణాలు మహానగరాలకు దీటుగా అభివృద్ధి సాధిస్తాయని అన్నారు. అనతికాలంలోనే నియోజకవర్గం ఊహించని రీతిలో అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. తన విజ్ఞప్తిపై స్పందించి కుడాను ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి కూనంనేని కృతజ్ఞతలు తెలిపారు. కాగా పాలకవర్గం ఏర్పడేవరకు కుడా చైర్మన్‌గా కలెక్టర్, వైస్ చైర్మన్‌గా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), చీఫ్ సెక్రటరీ, మున్సిపల్ డైరెక్టర్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ లేదా వారి నామినీలు సభ్యులుగా కొనసాగుతారు.



ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

క్రమబద్ధీకరణ ఎటుపాయె..?

- కొత్తగూడెం మున్సిపాలిటీలో దరఖాస్తుదారుల ఎదురుచూపులు
- గతేడాది అసెంబ్లీ ఎన్నికల ముందు 76 జీఓ విడుదల
- క్రమబద్ధీకరణ పట్టాల కోసం 1,531 మంది దరఖాస్తు
- ఎలక్షన్ కోడ్ రావడంతో నిలిచిపోయిన మంజూరు ప్రక్రియ
- మళ్లీ ప్రారంభించకపోవడంతో నిరీక్షిస్తున్న పట్టణవాసులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రంలో క్రమబద్ధీకరణ పట్టాల మంజూరు కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో డీడీలు చెల్లించి పడిగాపులు కాస్తున్నారు. దశాబ్దాల క్రితం స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న వారికి ఇంటిపై యాజమాన్య హక్కులు రాలేదు. దీంతో ఇళ్ల అమ్మకాలు, కొనుగోళ్లు జరగక పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం పట్టణవాసులు అవస్థ పడుతున్నారు.

ఎన్నికలు రావడంతో అటకెక్కిన ప్రక్రియ

కొత్తగూడెం పట్టణంలో గతేడాది 76 జీఓ కింద సర్వే చేపట్టాక ఎన్నికలు రావడంతో పట్టాల మంజూరు ప్రక్రియ నిలిచిపోయింది. దాదాపు 1200 పట్టాలకు పట్టణంలో సర్వే నిర్వహించి, ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. దీంతో పట్టాల ప్రక్రియ అటకెక్కింది. ఈ ప్రక్రియను ప్రస్తుతం ప్రభుత్వం హోల్డ్‌లో పెట్టిందని, అధికారికంగా ప్రకటన చేస్తే ప్రక్రియ మళ్లీ ప్రారంభమవుతుందని తహసీల్దార్ కార్యాలయ అధికారులు చెబుతున్నారు. నూతన ప్రభుత్వం క్రమబద్ధీకరణ పట్టాలపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయమూ ప్రకటించకపోవడంతో లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు. మంజూరు చేసిన పట్టాల్లో అనేక తప్పులు తడకలున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఒకరి భూమిని, మరొకరు పట్టా చేసుకోవడం, ఇంకో ఇంటి నంబర్‌ను ఉపయోగించి అప్పటి అధికారులు, సిబ్బంది అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం పొరబాట్లను సరి చేసుకునే అవకాశం కూడా లేకపోవడంతో బాధితులు ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టు చుట్టూ తిరుగుతున్నారు.

తొలుత వైఎస్ హయాంలో..

కొత్తగూడెం మున్సిపాలిటీలో ఇళ్లకు యాజమాన్య హక్కు కల్పించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో జీఓ నంబర్ 373ను తీసుకువచ్చారు. దీంతో పట్టణంలోని 11 వేల మంది క్రమబద్ధీకరణ పట్టాలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 4,600 మందికి పట్టాలు మంజూరు చేశారు. మిగిలిన 6,400 మందికి వివిధ కారణాలతో పట్టాలు రాలేదు. కొందరికి పట్టాలు వచ్చిన కూడా వారు రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడంతో ఆ పట్టాలకు విలువ లేకుండాపోయింది. మిగిలిన వారి కోసం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు చొరవతో ప్రభుత్వం 76 జీఓ విడుదల చేసింది. దీంతో మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్న వారిలో 6146 మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉండగా, ఈ జీఓ ప్రకారం 3,500 మందికి గతేడాది పట్టాలు మంజూరు చేశారు. అప్పుడు దరఖాసు చేసుకోనివారి కోసం 2022 జూలైలో చివరి అవకాశం ఇవ్వగా 1,531 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. అదే సంవత్సరం నవంబర్‌లో సర్వే నిర్వహించి కేవలం 530 మందికి మాత్రమే పట్టాలు మంజూరు చేశారు. మిగిలినవారి దరఖాస్తులను తిరస్కరించారు.

వీటిలోనూ అవినీతి, అక్రమాలు

ఖాళీ స్థలం ఉండి ఇళ్లు లేకపోయినా పట్టాలు ఇవ్వడం, సింగరేణి స్థలాలకు, ఇళ్లు ఉన్న వారు పక్కన ఉన్న వీధులను కబ్జా చేసుకున్నా పట్టాలు మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. సింగరేణి క్వార్టర్స్‌లో నివాసమున్న మున్సిపాలిటీ ప్రథమ మహిళా బంధువుకు పట్టాలు మంజూరు చేశారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ స్థలంలో కొందరు అప్పటికప్పుడు రూంల నిర్మాణాలు చేసి పట్టాలు పొందారు. ఒకే స్థలానికి రెండు పట్టాలు మంజూరైన సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ ఆరోపణలతో అప్పటి అధికారిని బదిలీ చేశారు. క్రమబద్ధీకరణ పట్టాలకు మొదటలో 2014 కట్ ఆఫ్ తేదీని నిర్దేశించారు. గతేగాది ఎన్నికల ముందు 2020 కట్ ఆఫ్ తేదీని పెంచి మరోసారి అవకాశం కల్పించారు. దరఖాస్తులు స్వీకరించి సర్వే చేపట్టి పంపిణీ దశకు చేరకునేలోగా ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ఈ విషయంపై తహసీల్దార్ పుల్లయ్యను వివరణ కోరగా.. ప్రభుత్వం పట్టాల ప్రక్రియపై ఎటువంటి నిర్ణయమూ తీసుకోలేదని, ప్రకటన వస్తే ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు.



కొత్తగూడెం పట్టణం వ్యూ

ఓటు నమోదు చేసుకోవాలి

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

పాల్వంచ/పాల్వంచరూరల్: ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలని వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లా ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఆశ్రమ పాఠశాల, డిగ్రీ కళాశాల, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ నవంబర్ 6వ తేదీ వరకు దరఖాస్తు గడువు ఉందని అన్నారు. మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మరోసారి గెలిపించాలని కోరారు. యూటీఎఫ్ బలపర్చిన ఉపాధ్యాయ, అధ్యాపకుల ఉమ్మడి అభ్యర్థిగా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.కిషోర్ సింగ్, ఎస్.కృష్ణ, జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.యాకూబ్ పాషా పాల్గొన్నారు.



గురుకుల కళాశాల అధ్యాపకులతో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

చెకుముకి వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

కొత్తగూడెంఅర్బన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి పరీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెకుముకి సంబురాలు విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన, ఆసక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అలవర్చాలని చెప్పారు. నవంబర్ 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి, డిసెంబర్ 13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయిలో పరీక్షలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రమేష్ కుమార్ మక్కడ్, రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు, జిల్లా శాఖ అధ్యక్షుడు వీరభద్రం, ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు, కొల్లు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తదితరులు


ఖమ్మంలో ఫోరెన్సిక్ ల్యాబ్

- నాలుగు జిల్లాల పోలీసులకు అందుబాటులో..
- సులభం కానున్న కేసుల పరిశోధన

ఖమ్మంక్రైం: కేసుల దర్యాప్తులో సాంకేతికత పరిజ్ఞానం కీలకమవుతోంది. అయితే, ఆధారాల సేకరణ, శాస్త్రీయంగా నిర్ధారణ కోసం ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీని ఆశ్రయించాల్సిన నేపథ్యాన.. వివిధ జిల్లాలకు కలిపి వరంగల్‌లో మాత్రమే ల్యాబోరేటరీ ఉండడంతో పోలీసు సిబ్బందికి దూరభారమవుతోంది. ఈ నేపథ్యాన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు కలిపి ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ ల్యాబోరేటరీ ఏర్పాటుచేశారు.

దూరభారం తగ్గేలా...

వరంగల్, ఖమ్మం, కరీంనగర్ పాత జిల్లాలకు కలిపి ప్రస్తుతం హనుమకొండలో ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీ కొనసాగుతోంది. ఈ జిల్లాల్లో నమోదైన కీలక కేసుల్లో సేకరించిన నమూనాలను నిర్ధారించి కోర్టుల్లో సమర్పించేందుకు సిబ్బంది తరచుగా వరంగల్ వెళ్లిరావాల్సి వస్తోంది. ఇక నల్లగొండ జిల్లాకు సంబంధించి కేసుల్లో హైదరాబాద్ వెళ్లాల్సి ఉంది. కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాక కూడా ఇదే పరిస్థితి ఉండడంతో సిబ్బంది వ్యయప్రయాసాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యాన ఖమ్మంలో కొత్తగా ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీని ఏర్పాటుచేయగా దూరాభారం తగ్గనుంది. ఈసందర్భంగా సీపీ సునీల్ దత్ మాట్లాడుతూ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు సంబంధించి ఖమ్మం జూబ్లీపురలోని ఎస్‌బీఐ ఎదుట పాత డీపీఆర్ఓ కార్యాలయంలో ఈ ల్యాబ్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. దోపిడీ, దొంగతనాలకు సంబంధించి నిందితుల వేలిముద్రల నిర్ధారణ, అనుమానాస్పద మృతుల్లో దర్యాప్తు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.



ఖమ్మంలో ఏర్పాటు చేసిన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్

సింగరేణి మెడికల్ బోర్డ్‌లో 120 మంది ఇన్‌వాలిడేషన్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మెయిన్ ఆస్పత్రిలో ఈ నెల 24, 25వ తేదీల్లో జరిగిన మెడికల్ బోర్డుకు సింగరేణి వ్యాప్తంగా 204 మంది కార్మికులను పిలువగా, 179 మంది హాజరయ్యారు. 26 మంది గైర్హాజరయ్యారు. 179 మందిలో 120 మంది ఇన్‌వాలిడేషన్ అయ్యారు. మిగిలిన 59 మందిలో కొందరు ఫిట్‌ఫర్ సేమ్ జాబ్‌కు ఎంపిక కాగా, మరికొందరిని హయ్యర్ రిఫరల్‌కు పంపించారు.

క్లుప్తంగా

మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రంజిత్ కుమార్


నియామక పత్రం అందుకుంటున్న రంజిత్ కుమార్

జూలూరుపాడు: మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జూలూరుపాడుకు చెందిన మందా రంజిత్ కుమార్ నియమితులయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య నియామక పత్రాన్ని అందజేశారు. మాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడనున్నట్లు ఈ సందర్భంగా రంజిత్ తెలిపారు.

కొనసాగిన సర్టిఫికెట్ల పరిశీలన


సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ మేనేజ్‌మెంట్ ట్రెయినీ (ఈ–2) పోస్టులకు సంబంధించి అర్హత సాధించిన అభ్యర్థులకు రెండోరోజు శుక్రవారం చేపట్టిన సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు 69 మందికి గాను 61 మంది హాజరయ్యారు. 8 మంది గైర్హాజరయ్యారు. కాగా, గురువారం 70 మందికి గాను 67 మంది హాజరు కాగా.. రెండు రోజుల్లో కలిపి 11 మంది గైర్హాజరయ్యారు.

ఫంక్షన్ హాల్ తాళాలు పగలగొట్టాడని ఫిర్యాదు


విచారణ చేస్తున్న పోలీసులు

పాల్వంచరూరల్: పెద్దమ్మగుడికి చెందిన మొదటి ఏసీ ఫంక్షన్ హాల్ నిర్వహణ వివాదాస్పదంగా మారింది. మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయానికి చెందిన మొదటి ఏసీ ఫంక్షన్ హాల్‌ను ఏడాదికి రూ.40లక్షల 4 వేలకు హరీశ్ లీజుకు తీసుకున్నాడు. రెండు వాయిదాల్లో డబ్బు చెల్లించాల్సి ఉండగా మొదటి వాయిదాలో రూ.20 లక్షల 2 వేలు చెల్లించాడు. రెండో వాయిదా చెల్లించకపోవడంతో ఈఓ ఇటీవల ఫంక్షన్ హాల్‌కు తాళంవేసి లీజు నిర్వాహకులకు నోటీస్ ఇచ్చారు. శుక్రవారం ఫంక్షన్ హాల్‌కు చెందిన పది తాళాల్లో ఏడు తాళాలను హరీశ్ పగలగొట్టి లోపలికి వెళ్లాడు. సమాచారం తెలుసుకున్న ఆలయ సిబ్బంది ఫంక్షన్ హాల్ వద్దకు వెళ్లగా వాగ్వాదం జరిగింది. ఎస్‌ఐకి ఫిర్యాదు చేశామని ఈఓ రజనీకుమారి వెల్లడించారు. ఏఎస్‌ఐ సుధాకర్ ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

సామాజిక తనిఖీలో బయటపడిన అక్రమాలు

కామేపల్లి: అటవీశాఖ ఆధ్వర్యాన నర్సరీలో చేపట్టిన మొక్కల పెంపకంలో అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీలో బయటపడింది. మండలంలోని ఊట్కూర్ జీపీ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ నర్సరీలో 749 బెడ్ల ఏర్పాటుచేసి 310 బెడ్లలో కలుపు తీయడమే కాక 382 బెడ్లు తరలించినట్లు రికార్డులో నమోదు చేశారు. ఈ పనులన్నీ వారం వ్యవధిలో పూర్తిచేసినట్లు పేర్కొనగా.. రూ.2,13,179 చెల్లించినట్లు తెలిపారు. కాగా, బృందంలో తనిఖీల్లో కేవలం 134 బెడ్లు మాత్రమే ఉన్నట్లు తేలింది. ఇక గ్రామంలో 390 మొక్కలు నాటగా 46 మొక్కలు మాత్రమే ఉన్నాయని గుర్తించారు. ఈ సమావేశంలో ఎస్‌ఆర్‌పీ సాంబశివచారి, డీఆర్పీలు శ్రీను, రవి, కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీలో చోరీకి యత్నం

కల్లూరు: కల్లూరు మెయిన్‌రోడ్‌లోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్‌బ్యాంక్‌లో చోరీకి దుండగులు విఫలయత్నం చేశారు. గురువారం అర్ధరాత్రి దాటాక బ్యాంక్ గ్రిల్స్‌కు వేసిన నాలుగు తాళాల్లో ఒకటి పగులగొట్టారు. అయితే, మిగిలిన తాళాలు పగలకపోవడంతో తమ ప్రయత్నాన్ని విరమించుకుని వెళ్లిపోయారు. ఈ ఘటనలో ఒక పురుషుడు, ఓ యువతి పాల్గొన్నట్లు సీసీ పుటేజ్ ద్వారా గుర్తించిగా బ్రాంచ్ మేనేజర్ రవికుమార్ శుక్రవారం ఉదయం చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

- వలు సమస్యలపై ఎమ్మెల్సీ కోదండరాం స్పందన
- భద్రాచలంలో పర్యటించిన టీజేఎస్ అధినేత


భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ అధికారులతో ఎమ్మెల్సీ కోదండరాం

భద్రాచలం: ఏపీలో కలిపిన ఐదు గ్రామ పంచాయతీల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ, తెలంగాణ ఉద్యమ నేత, టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శుక్రవారం ఆయన భద్రాచలంలో పర్యటించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉదయం వాకర్స్‌తో.. చర్ల రోడ్డులో ఉన్న గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానానికి చేరుకోగా ఆలయ అర్చకులు, ఈఓ రమాదేవి స్వాగతం పలికారు. పూజల అనంతరం ఉద్యమ నేత తిప్పన సిద్దులు ఇంటికి వెళ్లి కలిశారు. తర్వాత ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర విభజనలో భాగంగా ఏపీలో కలిపిన ఐదు గ్రామ పంచాయతీల సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తానని చెప్పారు. భద్రాచలం అభివృద్ధి కోసం నిధుల విడుదల, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే భద్రాచలాన్ని వరద నీటి నుంచి కాపాడేందుకు ఇరువైపులా కరకట్ట నిర్మాణం, ఇతర ప్రణాళికలు, విద్యార్థుల సమస్యలపై నివేదికను అందిస్తానని వెల్లడించారు. కార్యక్రమాల్లో నాయకులు పూనెం ప్రదీప్‌కుమార్, తిప్పన సిద్దులు, మారం వెంకటేశ్వరరెడ్డి, బొలిశెట్టి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రభుత్వం కార్మికుల కష్టాలను వింటుంది..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు పర్మనెంట్ కార్మికులతో సమానంగా పని చేస్తున్నా వారికి కనీస వేతనం అమలు కావడం లేదనందున వేతన సవరణ జీఓ 22 అమలుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం వెల్లడించారు. కొత్తగూడెంలోని రుద్రంపూర్ క్లబ్‌లో శుక్రవారం 'కాంట్రాక్ట్ కార్మికులతో మాటా–ముచ్చట'పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులే లేరని చెబుతూ పదేళ్లుగా వారిని విస్మరించిందని ఆరోపించారు. అందుకే ప్రజలు ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టినందున, కొత్త ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికుల వేతన సవరణ ఆలోచనలో ఉందని తెలిపారు. జీఓ అమలుకు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితో చర్చిస్తానని కోదండరాం చెప్పారు. సమావేశంలో మల్లెల రామనాథం, రాసూరి శంకర్, గూడెల్లి యాకయ్య, కరుణాకర్, సమ్మయ్య, ఉషారాణి, గట్టయ్య, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. కాగా, కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టీయూసీఐ నాయకులు ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం అందజేశారు. నాయకులు పెద్దబోయిన సతీశ్, వై.గోపాల్‌రావు, ఎం.చంద్రశేఖర్, రాజశేఖర్, ధర్మ పాల్గొన్నారు.


'మాట – ముచ్చట'లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న కోదండరాం

పాల్వంచరూరల్: ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం పాల్వంచ మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఈఓ రజనీకుమారి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య స్వాగతం పలికి సత్కరించారు.

రూ. కోటితో ఈత కొలను..

- ఇల్లెందు పట్టణంలో వేగంగా నిర్మాణ పనులు
- త్వరితగతిన పూర్తిచేసేలా మున్సిపల్ పాలకవర్గం చర్యలు


లేక్ వ్యూపార్క్‌లో సాగుతున్న ఈత కొలను నిర్మాణం

ఇల్లెందు: పట్టణంలోని లేక్ వ్యూ పార్క్‌లో మున్సిపల్ పాలక వర్గం రూ.కోటితో ఈత కొలను నిర్మాణం చేపట్టింది. చెరువుకట్ట పక్కన ఉన్న పార్క్‌లో ఇటీవల శంకుస్థాపన చేయగా, పనులు వేగవంతం చేశారు. ఇప్పటికే బెడ్ నిర్మాణం పూర్తి చేశారు. మున్సిపల్ పాలక వర్గ పదవీ కాలం వచ్చే జనవరితో ముగియనుండగా ఆ లోపు కొలనును పూర్తి చేసి ప్రారంభించాలని భావిస్తున్నారు. 36 ఫీట్ల పొడవు, 12 ఫీట్ల వెడల్పు, ఆరు ఫీట్ల లోతుతో ఈత కొలను నిర్మిస్తున్నారు. కొంత భాగం పిల్లల కోసం 4 ఫీట్లు లోతుతో చేపడుతున్నారు. దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేకంగా రెండు గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా నిర్మిస్తున్నారు. పక్కనే ఉన్న బావి నీటిని కొలనుకు ఉపయోగిస్తామని, స్త్రీ పురుషులకు వేర్వేరుగా గజ ఈతగాళ్లు, రక్షణ పరికరాల సహాయంతో ఈత నేర్చుకునేలా ఏర్పాట్లు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఆదివారం, సెలవు రోజుల్లో పట్టణవాసులు కుటుంబ సమేతంగా లేక్ వ్యూ పార్క్‌కు వచ్చి సేద తీరుతుండగా, స్విమ్మింగ్ పూల్ నిర్మాణం పూర్తయితే మరింత ఆహ్లాదకరంగా మారనుంది.

నాణ్యతగా పనులు..



వేగంగా ఈత కొలను పనులు పూర్తి చేసి మరో రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకొస్తాం. పనులు నాణ్యంగా చేపట్టేలా అధికారుల పర్యవేక్షిస్తున్నారు. పట్టణవాసులకు ఆరోగ్యం, ఆహ్లాదం అందిచేందుకు కృషి చేస్తున్నాం.

– దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్, ఇల్లెందు

ఈతతో ఎన్నో ఉపయోగాలు



మనిషికి ఈత మంచి వ్యాయామం. ఈత కొడుతున్నప్పుడు శరీరంలోని ప్రతీ కండరం కదులుతుంది. గుండె, ఊపిరితిత్తులు, మెదడు తదితర అవయవాలన్నీ చురుకుగా పనిచేస్తాయి. మానసిక, శారీరక ఉపయోగాలు అనేకం ఉన్నాయి.

– డాక్టర్ జి.హర్షవర్ధన్, ఇల్లెందు

కులగణన చిత్తశుద్ధితో చేపట్టండి

సత్తుపల్లిరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనను చిత్తశుద్ధితో చేపట్టాలని, తద్వారా కులాల వారీగా జనాభా లెక్కలు వెల్లడించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సత్తుపల్లిలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట మేరకు బీసీ జనాభా గణనతో పాటు కులాల వారీగా జనాభా వివరాలు సేకరించాలన్నారు. ఆపై జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు ఇతర అన్ని రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేస్తే బీసీలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి టి.శ్రీనివాస్‌తో పాటు నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, అమీద్, రాయల కోటేశ్వరరావు, మారగాని రాంబాబు, డీఎస్.చారి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాస్

వివాహిత అదృశ్యం

ములకలపల్లి: ఓ వివాహిత కనిపించకుండా పోయిన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత గత నెల 28వ తేదీన కిరాణా సరుకుల కొనుగోలు నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇప్పటివరకు తిరిగి రాలేదు. బంధువులు, మిత్రుల ఇళ్లవద్ద విచారించినా జాడ తెలియలేదు. సదరు మహిళ భర్త ఫిర్యాదు మరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వరిలో ఎండాకు బ్యాక్టీరియా తెగులు

కూసుమంచి: పలు ప్రాంతాల్లో వరి పైరుకు ఎండాకు బ్యాక్టీరియా తెగులు సోకిందని శాస్త్రవేత్తలు, అధికారులు తెలిపారు. మండలంలోని కొత్తూరు, ఎర్రగడ్డతండా గ్రామాల్లో తెగుళ్లు సోకిన వరి పొలాలను వైరా కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, కూసుమంచి ఏడీఏ సరిత శుక్రవారం పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. బ్యాక్టీరియా ఎండాకు తెగుళ్లు ఆశించిన పొలాలకు నత్రజని ఎరువు వాడకాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని తెలిపారు. తెగులు సోగాక నివారించడం కష్టమని, అందుకే ముందుగా లక్షణాలను గుర్తిస్తే వ్యాప్తిని అరికట్టవచ్చని చెప్పారు. ప్లాంటామైసిన్, పోషమైసిన్, అగ్రిమైసన్ మందుల్లో ఏదో ఒకటి పిచికారీ చేయాలని, వర్షాలు తగ్గాక ఆఖరు దఫా పొటాష్‌ను ఎకరాకు 20 కిలోల మేర వేయాలని సూచించారు. అలాగే, వరిలో కంకినల్లి, మానిపండు నివారణకు స్పైరోమిసిఫెన్, ప్రొపికొనజోల్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ వాణి, ఏఈఓ మానస, రైతులు పాల్గొన్నారు.


తెగులు సోకిన పొలంలో పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ఈ–నామ్‌లో సాంకేతిక సమస్య

పాత విధానంలోనే పంటల కొనుగోళ్లు

ఖమ్మంవ్యవసాయం: ఈ–నామ్(ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్) విధానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. సర్వర్లు పనిచేయక గత సోమవారం నుంచి ఖమ్మం మార్కెట్‌లో ఈ–నామ్ అమలు కావడం లేదు. ఇక్కడి మార్కెట్‌లో పత్తి, అపరాల కొనుగోళ్లలో కొన్నేళ్లుగా ఈ–నామ్ విధానం అమలుచేస్తున్నారు. రైతు మార్కెట్‌కు పంట తీసుకొచ్చాక వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి గుర్తింపు నంబర్ కేటాయిస్తారు. ఈ నంబర్ ఆధారంగా కమీషన్‌దారులు ఖరీదుదారులకు పంటను చూపించి, ఆతర్వాత ధరను రహస్యంగా బిడ్ చేస్తారు. తద్వారా పోటీ ఏర్పడి రైతుల పంటకు మెరుగైన ధర లభిస్తోంది. అంతేకాక పంట తూకం కూడా ఈ–నామ్‌కు అనుసంధానమై ఎలాంటి తేడా లేకుండా దడువాయి పట్టీ జారీ అవుతోంది. అయితే, ప్రస్తుతం సర్వర్ పనిచేయకపోవడంతో పాత పద్ధతిలోనే కొనుగోలు చేస్తున్నారు. రైతులు తీసుకొచ్చిన పంటల ధర, తూకం వివరాలను చేతిరాతతో నమోదు చేస్తుండడంతో కొంత మేర నష్టం జరుగుతోందని చెబుతున్నారు. ఈ అంశంపై మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా దేశవ్యాప్తంగా సర్వర్ పనిచేయడం లేదని, ఒకటి, రెండు రోజుల్లో పరిష్కారమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం అందిందని తెలిపారు.

గాయపడిన యువకుడు మృతి

దుమ్ముగూడెం: మండలంలోని మహదేవపురం – చిన్న ఆర్లగూడెం గ్రామాల మధ్య కోడివారి గుంపు సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొమరం వీర్రాజు మృతిచెందాడు. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందినట్లయింది. కొత్త నారాయణరావుపేట గ్రామానికి చెందిన పాయం జంపన్న, కొమరం వీర్రాజు బైక్‌పై లక్ష్మీనగరం వచ్చి తిరిగి వెళ్తుండగా కోడివారి గుంపు వద్ద బైక్ అదుపుతప్పి తాటిచెట్టును ఢీకొట్టారు. పాయం జంపన్న ఘటనా స్థలంలోనే మృతి చెందగా కొమరం వీర్రాజు భద్రాచలం నుంచి వరంగల్ తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలప స్వాధీనం

చర్ల: మండలంలోని బోదనెల్లి అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన టేకు కలపను శుక్రవారం అటవీశాఖాధికారులు పట్టుకున్నారు. దుమ్ముగూడెం ఫారెస్ట్ రేంజ్ అధికారిణి కమల కథనం ప్రకారం.. బోదనెల్లి అటవీ ప్రాంతంలో అక్రమంగా కలప నిల్వ చేశారని, దానిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేసి, సుమారు రూ.2 లక్షల విలువ గల 15 టేకు దిమ్మెలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కలపను డివిజన్ కార్యాలయానికి తరలించినట్లు అధికారిణి కమల వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


పాండురంగాచారి (ఫైల్)

వేంసూరు: మండలంలోని కల్లూరుగూడెం ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అడసర్లపాడుకు చెందిన తాటికొండ పాండురంగాచారి(42) మర్లపాడులోని తన షాపునకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కల్లూరుగూడెం వద్ద రహదారిపై గేదెలు అడ్డుగా వచ్చాయి. వీటిని తప్పించే క్రమాన కంకర్‌లోడ్ టిప్పర్ లారీ ఢీకొట్టడంతో ఆయనకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీర ప్రసాద్ పేర్కొన్నాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

పెనుబల్లి: పొరపాటుగా యాసిడ్ తాగిన మండలంలోని కేడబ్ల్యూ చౌడవరానికి చెందిన కణితి సత్యనారాయణ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన మద్యం మత్తులో బ్యాటరీలో పోసే యాసిడ్‌ను తాగునీటిగా భావించి తాగగా.. ఆ విషయాన్ని కుమారుడు సాయికిరణ్‌కు చెప్పాడు. దీంతో సత్యనారాయణను కల్లూరులోని ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించి చికిత్స చేయిస్తుండగా శుక్రవారం మృతి చెందాడని ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

ఎకో బ్రిక్ టీపాయ్‌కు గవర్నర్ ప్రశంస


ఎకోబ్రిక్ టీపాయ్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర గవర్నర్


సారపాక గ్రామ పంచాయతీ తయారు చేసిన ఎకోబ్రిక్ టీపాయ్

బూర్గంపాడు: భద్రాద్రి కలెక్టరేట్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వచ్చిన సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక స్టాళ్లలో సారపాక గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తయారు చేసిన ఎకోబ్రిక్ టీపాయ్ ఆయనను ఆకర్షించింది. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లను పరిశీలించిన గవర్నర్ సారపాక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎకోబ్రిక్ టీపాయ్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. దీనిని తయారు చేసిన విధానాన్ని జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఆయనకు వివరించారు. తాగి పడేసిన వాటర్ బాటిళ్లు, కూల్‌డ్రింక్ బాటిళ్లతో ఎకో బ్రిక్ టీపాయ్ తయారు చేసినట్లు వివరించారు. సారపాక గ్రామపంచాయతీలో చేపడుతున్న ఎకోబ్రిక్ చర్యలను అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విద్యాచందన, వేణుగోపాల్, మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరెడ్డి, ఎస్‌బీఎం జిల్లా కోఆర్డినేటర్ రేవతి, ఖాదర్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో ట్రాఫిక్ ఆంక్షలు

కొత్తగూడెంటౌన్: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం జిల్లాలో పర్యటించారు. పాల్వంచలోని కలెక్టరేట్‌ను సందర్శించారు. గవర్నర్ పర్యటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కొత్తగూడెం సబ్ డివిజన్ పరిధిలోని ఇల్లెందు క్రాస్ రోడ్డు, లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్, త్రీటౌన్, వన్‌టౌన్, చుంచుపల్లి పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో వన్‌వే ట్రాఫిక్ నిబంధన పెట్టి బారికేడ్లను ఏర్పాటు చేశారు. కొత్తగూడెం మీదుగా ఖమ్మం వెళ్తున్న సమయానికి 30 నిమిషాల ముందు పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. గవర్నర్ కాన్వాయ్ కొత్తగూడెం మొర్రేడు వాగు నుంచి త్రీటౌన్‌కు వస్తున్న సమయంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, వన్‌టౌన్ ఏరియా, పోస్టాఫీస్ ఏరియా, చుంచుపల్లి విద్యానగర్, ఖమ్మం రోడ్డులో ట్రాఫిక్‌ను ఎక్కడికక్కడే నిలివేశారని వాహనదారులు, ప్రజలు వాపోయారు. అర్ధగంట పాటు నానా అవస్థలు పడ్డామని పలువురు అసహనం వ్యక్తం చేశారు.

మీడియాపైనా..

సూపర్‌బజార్(కొత్తగూడెం): గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన సందర్భంగా కలెక్టరేట్‌లో మీడియాపై ఆంక్షలు విధించారు. మొదట కలెక్టరేట్ మెయిన్‌గేట్ వద్దనే మీడియా ప్రతినిధులను పోలీసులు అడ్డుకున్నారు. ఉన్నతాధికారులకు పదేపదే ఫోన్లు చేయడంతో చివరికి పేర్లు రాసుకుని లోపలకు అనుమతించారు. కవరేజ్ కోసం గవర్నర్ ఫొటోలు తీస్తున్న సందర్భంలో కూడా ఇదేతంతు కొనసాగింది. కాన్ఫరెన్స్ హాల్లోకి అనుమతి లేదని అక్కడ కూడా మీడియాను అనుమతించలేదు. కానీ, కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధుల వెంట మాత్రం వారి అనుచరగణం కాన్ఫరెన్స్‌హాల్లోకి దర్జాగా వెళ్లారు. వీవీపీల పర్యటన సందర్భంగా మీడియాకు ముందుగానే పాసులు ఇవ్వడం ఆనవాయితీ. ఈసారి అలాంటి ప్రక్రియను నిర్వహించ లేదు. మీడియాను అవమానించే విధంగా గవర్నర్ ప్రోగ్రామ్‌లో అధికారుల, పోలీసుల వైఖరి ఉందని మీడియా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు.

తెలంగాణను అప్పుల పాలు చేశారు..

- మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్
- విద్యుత్ కేంద్రం సాధనకు కాళ్లయినా పట్టుకుంటా: కూనంనేని


మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్


ప్రార్థనలో పాల్గొన్న ఎంపీ, తదితరులు

పాల్వంచ: ప్రజల త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న తెలంగాణను కేసీఆర్ తన పదేళ్ల పాలనలో అప్పుల పాలు చేశారని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ ఆరోపించారు. పాల్వంచ కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారం ఎస్‌ఈ కాటం సంజీవయ్య ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయగా.. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంతో కలిసి పాల్గొన్న ఎంపీ మాట్లాడారు. ప్రజల ఆకాంక్షను గుర్తించి సోనియాగాంధీ రాష్ట్రాన్ని ఇస్తే.. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను కేసీఆర్ అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు. కాగా, సింగరేణి, జెన్‌కో ఉద్యోగుల సంక్షేమంపై కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ.. పాల్వంచకు మరో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ కేంద్రాన్ని తెచ్చేందుకు తలవంచుతానని, అవసరమైతే కాళ్లయినా పట్టుకుంటానని చెప్పారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడగా రాష్ట్ర అటవీ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్‌రావు, శ్రీనివాసబాబు, బిచ్చన్న, టీఎస్‌ఎస్.మూర్తి, రిటైర్డ్ సీఈ సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రార్థనలు

ఇల్లందు: ఇల్లెందుకు చెందిన కూరగాయల వ్యాపారి యాకూబ్ కుమారులు గౌస్, జానీ, ఖాజా ఆధ్వర్యాన శుక్రవారం దర్గాలు ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ ప్రార్థనకు మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ తదితరులు హాజరయ్యారు.

సీతారామ ప్యాకేజీ–13కి టెండర్లు

ఖమ్మంఅర్బన్: సీతారామ ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ–13లో భాగమైన పాలేరు లింక్ కెనాల్ నిర్మాణానికి జలవనరుల శాఖ అధికారులు టెండర్లు పిలిచారు. 10.5 కి.మీ. పొడవైన ఈ కెనాల్ పనుల అంచనా వ్యయం రూ.190 కోట్లుగా పేర్కొన్నారు. టెండర్ దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకునేందుకు శుక్రవారం నుంచే అవకాశం కల్పించినట్లు జలవనరుల శాఖ ఖమ్మం ఎస్‌ఈ ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, టెండర్ల నమోదుకు నవంబర్ 8వ వరకు గడువు ఉందని వెల్లడించారు. సింగరేణి మండలం చీమలపాడు నుండి ఏన్కూరు మండలం బురధరాఘువాపురం వరకు ఈ ప్యాకేజీలో భాగంగా మట్టి తవ్వకం, కట్ట నిర్మానం, సీసీ లైనింగ్ తదితర పనులు చేపట్టాల్సి ఉంటుంది.